బహిరంగ ప్రదేశంలో మద్యం నిషేదం

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేదాజ్ఞలు కొనసాగుతాయని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణపౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మం చిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడంపై నిషేదాజ్ఞలు పొడగించామన్నారు. అలాగే డీజే, డ్రోన్‌లపై కూడా నిషేదాజ్ఞలు కొనసాగుతాయని తెలిపారు. బంద్‌ల పేరిట బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెధిరింపులకు గురి చేసిన వారిపై చట్టపర చర్యలు తీసుకుం టామని సీపీ తెలిపారు.

విజేతను అభినందించిన డీఈవో

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి) : హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఆంగ్ల ఒలంపియాడ్‌లో మంచిర్యాల పట్టణం రాజీ వ్‌నగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యా ర్థిని సంజన ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా డీఈవో యాదయ్య సన్మానించారు. 33 జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ప్రథమ స్థానం సంజన సాధించడం అభినందనీయమని కొనియాడారు. ప్రిన్సిపాల్ బుచ్చన్న, ఉపాధ్యాయులు సరిత, రమేష్, రజిని, పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులపై కేసు

జన్నారం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి రమాదేవి, ఎఫ్ఆర్‌వో రవి, చెక్‌పోస్టు సిబ్బంది పోచన్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం తపాలపూర్ చెక్‌పోస్టు వద్ద మొబిన్‌ఖాన్ అనే యువకుని కారు తనిఖీ విషయంలో మొబిన్‌ఖాన్‌తో గొడవ పడి దాడికి పాల్పడ్డారని, బాధితుడు మొబిన్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటల్లో ప్రతిభ

జన్నారం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర స్థాయి ఇంగ్లీష్ ఉపన్యాస పోటీల్లో మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్. అరవిందరాణి తృతీయ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న శనివారం తెలిపారు. శుక్రవారం హైద్రాబాద్‌లో రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ డైరెక్టర్ రమేష్, అనురాగ్‌యూనివర్శిటీ డీన్ శ్రీనివాసరావులు విద్యార్థినికి, గైడ్ టీచర్ , సీనియర్ ఉపాధ్యాయుడు కమలాకర్‌కు ప్రశంసా పత్రం, ప్రైజ్‌మనీ అందించి శాలువాతో సన్మానించినట్లు తెలిపారు.

మధ్య తరగతికి ఊరట

- 12 లక్షల ఆదాయం వరకు నో టాక్స్
- రైళ్ల కేటాయింపులో మళ్లీ నిరాశే
- గని కార్మికుల ఆదాయ పన్ను రద్దు ప్రస్తావనేది..?
- కేంద్ర బడ్జెట్‌పై భిన్న స్వరాలు

మంచిర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్ల మెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సాలీనా రూ. 12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వ డం భారీ ఊరట కలిగించే అంశమే. అలాగే సామన్య ప్రజలు వినియోగించే పలు రకాల వస్తువుల ధరలు తగ్గనుండటం కూడా కొంత మేర ఆర్థిక వెసులుబాటు కలిగించనుంది. కేంద్ర బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన పన్ను మినహాయింపులు, ఎగుమతి, దిగుమతులపై సుంకాల మార్పులు పలు రకాల వసువుల ధరలపై ప్రభావం చూపనున్నాయి. బడ్జెట్ నేపథ్యంలో పలు రకాల వస్తువుల ధరలు పెరు గుతుండగా, మరికొన్నింటిపై తగ్గనున్నాయి.

ధరలు తగ్గేవి ఇవే...

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కారణంగా కింది వస్తువల ధరలు తగ్గనున్నాయి. క్యాన్సర్ మందులు, అత్యవసర సమయాల్లో ప్రాణాలు రక్షించే మందులు, ఫ్రోజెన్ చేపలు, చేపల పేస్ట్, వెట్ బ్లూ లెదర్, 12 కీలకమైన ఖనిజాలు, ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీ లు, దేశంలో తయారైన దుస్తులు, మొబైల్ ఫోన్లు, తోలు వస్తువులు, వైద్య పరికరాల ధరలు తగ్గనుండటంతో సామాన్య ప్రజలకు కొంతమేర ఉపశమనం కలగనుంది.


ఐటీ రద్దుకు నోచుకోని గని కార్మికులు..

కేంద్ర బడ్జెట్‌లో తమకు ఇన్‌కంటాక్స్ రద్దు చేస్తారని సింగరేణి కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయితే బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవ డంతో కార్మికలోకం తీవ్ర నిరాశ, నిస్సృహలకు గురవు తోంది. దశాబ్దాలుగా ప్రజా ప్రతినిధులు, రాజ కీయ నాయకులు సింగరేణి కార్మికుల ఐటీ రద్దుకు కృషి చేస్తామంటూ హామీలు ఇవ్వడమే తప్ప.... అది కార్యరూపం దాల్చడం లేదు. కనీసం ఈ సారైనా తమకు మేలు జరుగుతుందని భావించిన కార్మికులకు ఆశనిపాతమే ఎదురైంది.

రైళ్ల కేటాయింపుపై వివక్ష....

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నూతన రైళ్ల కేటాయింపులు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజ లకు నిరాశే కలిగింది. ఉత్తర తెలంగాణలోని కాగజ్ నగర్ నుంచి కాజీపేట జంక్షన్ వరకు ప్రయాణికుల సంఖ్యకు సరిపడా రైళ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కరోన కారణంగా రద్దయిన రైళ్లను తిరిగి ప్రారంభించలేదు. వాటిలో కాజీపేట్-నాగపూర్ ప్యాసింజర్, కాజీపేట-ముంబై సూపర్ ఫాస్ట్ రైలు, రామగుండం- విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లు తిరిగి ప్రారంభిస్తే ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

(తరువాయి 8లో)




పేద పిల్లల కోసం అటల్ టింకరింగ్ ల్యాబ్స్



పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ మిషన్ తీసుకొచ్చింది. ఈ పథకంలో రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తారు. అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు.

- వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 75 వేల కొత్త మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

వ్యవసాయానికి ఊతం



- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంపు
- ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజన కింద వెనకబడిన జిల్లాలో వ్యవసాయానికి ప్రోత్సాహం
- కందులు, మినుములు కొనుగోలు చేయనున్న కేంద్రం
- పండ్లు, కూరగాయల ఉత్పత్తికి నూతన పథకం
- పత్తి ఉత్పాదకత పెంచేందుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మిషన్

- దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు
- జల్ జీవన్ మిషన్ కిందరక్షిత మంచినీరు సరఫరా



పెరిగేవి: ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లే, సిగరెట్లు

తగ్గేవి: క్యాన్సర్ మందులు, ప్రాణాలను రక్షించే మందులు, ఫ్రోజెన్ చేపలు, ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీలు, దేశంలో తయారైన దుస్తులు, మొబైల్ ఫోన్లు, లెదర్ వస్తువులు, వైద్య పరికరాలు

ఉపాధి హామీ రద్దు కాకుండా చూడండి

కలెక్టర్‌కు కూలీల వినతి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కార్పొరేషన్‌లో గుడిపేట గ్రామాన్ని విలీనం చేయడం వలన ఉపాధి హామీ పథకం రద్దు అవుతుందని, ఉపాధి లేక అనేక కుటుంబాలు నష్టపోతామని గ్రామానికి చెందిన పలువురు కూలీలు శనివారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పథకం ద్వారా లబ్ది పొందుతున్న చాలా మంది నిరుపేద కూలీలు నష్టపోతారని విన్నవించారు. అంతకు ముందుగా కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. మహిళా కూలీలు కొందరు అధికారులను కలువడానికి ప్రయత్నాలు చేస్తుండగా వారందరితో స్థానిక ఎస్సై సుగుణాకర్ మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం ఐదుగురు మహిళ కూలీలు వెళ్లి కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు.

అధ్వానంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన అట్టర్ ప్లాప్ బడ్జెట్ అని, ఇంతకంటే దారుణమైన బడ్జెట్ మరెన్నడు లేదని పెద్దపల్లి ఎంపీ గడ్డంవంశీకృష్ణ అన్నారు. శనివారం విలేకరులకు ప్రకటన పంపారు. బీజేపీ పదేళ్ల పాలనలో టీడీటీ అతి కష్టంగా నమోదవుతుందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం దేశంలో నిరు ద్యోగ సమస్య తారా స్థాయికి చేరిందని, రానున్న రోజుల్లో దేశానికి పెను ముప్పుగా మారిందన్నారు.

నిరుద్యోగంపై ఆర్థిక మంత్రి మాట్లాడ కపోవడం దారుణమన్నారు. ఇది ప్రజలకు నిరాశ కలిగించే బడ్జెట్ అని మండిపడ్డారు.

ధృవన్ క్షేమం..

గంగాధర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన మహిళ కుమారుడు ధృవన్ క్షేమంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తెలిసింది. ఇటీవల మంచిర్యాలకు చెందిన మమత గత నెల 25న కుమారుడిని వెంటబెట్టుకుని కారులో బయలుదేరింది. అనూహ్యంగా అదే నెల27న గంగాధర మండలం కురిక్యాల శివారులో మమత అనుమాదాస్పదంగా మృతి చెందింది. తల్లితో పాటు కుమారుడు ధృవన్ కారులో ఎక్కినట్లు మంచిర్యాలలో సీసీ కెమెరాలో రికార్డైంది. తల్లి మమత హత్యకు గురికాగా కుమారుడి ఆచూకి నాలుగు రోజులైనా లభించలేదు. గంగాధర ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. మృతురాలిని హత్య చేసిన రోజున వారు ప్రయాణించిన కారు కరీంనగర్ రేకుర్తి నుంచి రెండు మార్లు గంగాధర మండలం కురిక్యాల వరద కాలువకు వచ్చినట్లు సీసీ పుటేజీల్లో పోలీసులు గుర్తించారు. మంచిర్యాల, హైదరాబాద్‌లో విచారణ జరిపిన పోలీసులు మమత కుమారుడు ధృవన్ ఉన్న ప్రదేశాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాలుడు సురక్షితంగా ఉండగా ఇరు కుటుంబ సభ్యులు, పోలీసులు ఊపిరి పీల్చుకు న్నారు. మమత హత్యకు సుపారీ తీసుకుని పక్కా ప్రణాళిక ప్రకారం హత్య చేసి నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆరు రోజులుగా మిస్టరీగా మారినా మమత హత్య కేసు ఓ కొలిక్కి వచ్చినట్లు భావిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్

గర్మిళ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన వి ద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో లేదా సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, ఆపేసిన సమయం లో ఆయాలైన్, సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఎస్ఈ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ ఒక 33/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి మరొక 33/11కేవీ సబ్‌స్టేష న్‌కు, అలాగే ఒక 33/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి మరొక 132/1కేవీ సబ్ స్టేషన్ మధ్య అనుసంధానంగా ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయంగా విద్యు త్ సరఫరా అందిస్తామన్నారు. దీని వల్ల వినియోగదారులకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఉన్న 54 నెంబర్స్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 26 నెంబర్స్ 33కేవీ లైన్లలో ఇంటర్ లింకింగ్ వ్యవస్థను చేపట్టామన్నారు. ఇంకా 4 నెంబర్స్, 10 నెంబర్స్ లైన్లలను గుర్తించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బెటాలియన్ బృందాన్ని అభినందించిన డీజీపీ

హాజీపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించిన టీజీఎస్‌పీ 13వ బెటాలియన్ మంచిర్యాల కాంటిజెంట్ సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలవడంపై డీజీపీ జితేందర్‌రెడ్డి అభినందించారు. హైద్రాబాద్‌లోని రాష్ట్ర పోలీసు ముఖ్య కార్యాలయంలో గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములును అభినందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ తెలంగాణ పోలీసు శాఖకు ఛత్తీష్‌గఢ్ పోలీసు శాఖ పంపిన జ్ఞాపికను అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు గూడెంగుట్ట ముస్తాబు..



ఆలయానికి రంగులు వేస్తున్న కార్మికులు

దండేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దండెపల్లి మండలం గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 6 నుంచి 13 వరకు శ్రీస్వామి వారి కల్యాణ బ్రహోత్సవాలను ఉత్సవాలను ఆత్యంత వైభవంగా నిర్వహించేందుకు పనులు చేపట్టారు. అందులో భాగంగా గూడెంగుట్టపై వెలసిన సత్యదేవున్ని ప్రధానలయం, యజ్ఞశాల, వ్రతమండపం, అంజనేయస్వామి ఆలయాలతో పాటు ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న దేవాలయాలకు రంగులు వేస్తున్నారు. 9న గోధూళిక సుముహర్తాన శ్రీస్వామి వారి కళ్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈవో సంకటాల శ్రీనివాస్ వెల్లడించారు.

కార్పొరేషన్ కమిషనర్‌కు సన్మానం

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కార్పొరేషన్‌కు నూతనంగా వచ్చిన కమిషనర్ శివాజీని తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, అశోక్ తేజ, రామ గిరిబాబు నేష్, నర్సయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ విజయవంతం

- కమిషనరేట్‌లో 88 మంది బాలలకు విముక్తి
- రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని కమిషనరేట్ వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించామని, దానిలో కమిషనరేట్ పరిధిలో 88 మంది బాల బాలికలను గుర్తించినట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా పరిదిలో బాలురు-55, బాలికలు 19 మొత్తం మంది 74 మంది 1 కేసు నమోదు చేసి ఇద్దరు బాలకార్మికులని విముక్తి చేసి పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామన్నారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయినా, వదిలివేయ బడినా బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కాల్ చేసి పోలీసు వారికి సమాచారం అందంచాలన్నారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని అభినందించారు.



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను వెంటనే నిర్మించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం ప్రాణహిత ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను వెంటనే నిర్మించాలని వామపక్ష ఐక్యవేదిక సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాణహిత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు 2008లో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసిందన్నారు. ప్రాణహిత నుంచి ఎల్లంపల్లి వరకు 116 కిలోమీటర్ల కోసం రూ. 1700 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. 2014లో బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ నీరు లేదనే సాకు చూపి రీ డిజైనింగ్ పేరిట మార్చారన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు లను పూర్తి చేయాలని ఫిబ్రవరి 2న మంచిర్యాలలో వామపక్ష ప్రజాస్వామిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నైనాల గోవర్ధన్, లక్ష్మణ్, ప్రకాస్, లాల్‌కు మార్, దేవరాజ్, మంగ, కలిందర్ ఖాన్, గోపినాథ్, మల్లన్న, రంజిత్, అరుణ, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్నవామపక్ష ఐక్యవేదిక సంఘం నాయకులు

వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులకు వాణిజ్య ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఉద్యానవన అధికారి అనితతో కలిసి వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు అధిక ఆదాయం ఇచ్చేఆయిల్‌పాం, పండ్ల తోటల పెంపకం రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

వ్యవసాయాధికారులు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలతో ప్రజా చైతన్యం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కళా ప్రదర్శనలతోనే ప్రజా చైతన్యం సాధ్యమని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మందమర్రి రిథమ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మందమర్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలకు ఆయన అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో కళాకారులు తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. మున్నూరు కాపు సంఘం పట్టణాధ్యక్షుడు మిట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కళలకు, కళాకారులకు ప్రతి ఒక్కరు ప్రోత్సాహం అందించాలన్నారు. పెద్ద సంఖ్యలో కళాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తవక్కల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన తెలంగాణ సంస్కృతి ప్రదర్శన కార్యక్రమానికి హాజరైన అందరినీ ఎంతో ఆకట్టుకుంది. అలాగే పలువరు చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రిథమ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహకులు, కళాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : శాసన మం డలి ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైద్రా బాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల స్థానానికి నల్గొండ, ఖమ్మం వరంగల్ స్థానాలకు ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసిందన్నారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్‌ల స్వీకరణ, 11న పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయన్నారు. 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరగాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్ రావు, ఆర్డీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

లక్షెట్టిపేట, ఫిబ్రవరి, 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశా లల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని లక్షెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహాత్మ సంతోష్ అన్నారు. శనివారం కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో దండే పల్లి, జన్నారం మండలాల్లోని వివిధ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల కోసం క్యాంపెనింగ్ నిర్వహించారు. ఈక్యాంపరింగ్‌లో అధ్యాపకులు తిరుపతి, ప్రేమలత, సంధ్యారాణి, కవిత, స్వప్న పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాక లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలోని చేరాలని ప్రిన్సిపాల్ మహాత్మ సంతోష్ కోరారు. శనివారం దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలోని కళాశాల అధ్యాపకులతో కలిసి ఆడ్మిషన్ క్యాంపెనింగ్ నిర్వహించారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

తాండూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, యువతకు తాండూర్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గంజాయి రహిత సమాజం కోసం అందరు పాటు పడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, బెల్లంపల్లి డివిజన్ ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కల్పన, పాఠశాల సహదారుడు విజయ్‌కుమార్, నిర్వాహకులు దుద్దిళ్ల విష్ణువర్ధన్, సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగల అరెస్టు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్ పరి కరాల్లో బ్యాటరీలు దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నరేందర్ శనివారం తెలిపారు. తాండూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన శ్రీను, తిరుపతి, మహేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా రూ. 1.55 లక్షల విలువైన బ్యాటరీలు బ్యాటరీలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నార న్నారు. వారి వద్ద నుంచి 55 బ్యాటరీలను, చోరికి ఉపయోగించిన ఓమిని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీ వైద్య సేవలను అందించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగంగా మెరుగైన వైద్య సేవలందించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రాధిక అన్నారు. శనివారం వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. వైద్యులు మూర్తి, శీల, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

చెన్నూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని పెద్ద చెరువుపై నిర్మించిన ట్యాంకుబండ్‌ను టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. శనివారం చెన్నూరు పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ ప్రాంతంలో అపరిశుభ్రం అయ్యేలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లిలోని పోచమ్మ గడ్డ రహదారిపై శనివారం రాత్రి బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. తాళ్లగురిజాల ఎస్ఐలు రమేష్, మజారుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్య తరగతికి ఊరట..

5వ పేజీ తరువాయి

అలాగే బల్లార్షా-కాజీపేట, వరంగల్ మ ధ్య ప్యాసింజర్ రైళ్లు పెంచాలనే డిమాండ్లు ఉన్నప్పటికి వాటిని పరిగణలోకి తీసుకోలేదు.

తెలంగాణపై వివక్ష...

కామని శ్రీనివాస్, తాండూరు



రైళ్ల కేటాయింపులో ఆది నుంచి తెలంగాణపై బీజే పీ వివక్ష చూపుతూనే ఉంది. 12 ఏళ్ల నుంచి ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య కొత్త రైళ్ల కేటాయింపులు లేవు. ఉద యం 4 గంటలకు భాగ్యనగర్ ట్రైన్ తరువాత మధ్యాహ్నం ఇంటర్‌సిటీ వరకు రెగ్యులర్ ట్రైన్లు లేకపో వడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బడ్జెట్‌లో కొత్త రైళ్ల ఊసే ఎత్తలేదు.

ప్రైవేటీకరణకు పెద్దపీట..

రంగు రాజేశం, ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్



కీలక వనరులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోపెట్టే క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లినట్లయింది. బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని వందశాతానికి పెంచారు. ధనిక వర్గాలపై విధిస్తున్న పన్ను శాతాన్ని పెంచాలన్న ఆర్థిక వేత్తల సలహాలను పరిగణలోకి తీసుకోలేదు. దేశానికి అన్నం పెట్టే రైతులకు కనీస మద్దతు ధర విషయంలోనూ ప్రస్తావనలేదు. దేశంలోని ఉద్యోగులు, శ్రామిక వర్గాల ప్రజలకు ఆకాంక్షలకు విరుద్ధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.

కార్పొరేట్‌కు దారాదత్తం...

నైనాల గోవర్దన్, జలసాధన సమితి జిల్లా కన్వీనర్



దేశంలో వ్యవసాయ రంగం 60 శాతం ప్రజలకు ఉపాధిని ఇస్తుంది. ఆ రంగంలో చేపట్టే సంస్కర ణలు రైతుల ఆదాయాన్ని పెంచేవిగా కాకుండా, బడా కార్పొరేట్ శక్తులకు మద్దతిచ్చే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. రద్దు చేసిన మూడు వ్యవ సాయ చట్టాలను దొడ్డిదారిలో తీసుకువచ్చినట్ల యింది. వ్యవసాయ మార్కెట్ రంగం నుంచి రైతు లను దోపిడీ చేయడానికి కొత్త పద్ధతులను మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

సేంద్రీయ వ్యవసాయానికి మొండిచేయి..

కేవీ చిదానంద కుమారి, న్యాయవాది



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని చెబుతున్న ప్రభుత్వం సేంద్రీయ వ్యవసా యానికి మొండి చేయి చూపింది. ప్రజల ఆరోగ్యరీ త్యా, భూమిని రక్షించే సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాల్సి ఉండే. అలాగే వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాల కొనుగోలుపై సబ్సిడీ కల్పించకపోవడం సమంసజంగా లేదు. కూలీల కొరత వేధిస్తున్న నేటి తరుణంలో యంత్రాల అవసరం ఎంతగానో ఉంటుంది.

రాష్ట్రానికి ఒరిగిందేమీలేదు..

సబ్బని కృష్ణ, బెల్లంపల్లి



బీహార్, ఢిల్లీలో ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఇది కేవలం ఎన్నిక ల్లో లబ్ధిపొందే బడ్జెట్‌గానే ఉంది. ఇక సింగరేణి కార్మికులకు ఇన్‌కం టాక్స్ రద్దు చేయలేదు. అలాగే సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఎలాంటి ని ధులు కేటాయించలేదు. విద్యాభివృద్ధికి దోహదపడే నవోదయ, సైనిక్ స్కూల్ కేటాయించలేదు. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగేదేమీ లేదు.

ఫ్రెండ్లీ బడ్జెట్..: బాపు రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్



మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఫ్రెండ్లీ బడ్జెట్. రూ. 12 లక్షల వరకు ఆదాయ పన్ను తొల గించారు. రూ. 18 లక్షల ఆదాయం ఉన్న వాళ్లకు రూ. 70 వేలు ఆదా అవుతాయి. అలాగే చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు రుణ పరిమితిని రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు పెంచడం ద్వారా వాటి స్థాపనను ప్రోత్సహించినట్లయింది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు పెద్దపీట వేశారు.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్

వైద్య శాంతికుమారి, ఉపాధ్యాయురాలు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



కేంద్రం బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అను కూలంగా ఉంది. ఆదాయపు పన్నులో రూ. 13 లక్షల కుపైన ఉన్నవారికి కూడా రిబేట్ ఇవ్వాలి. పెరుగుతున్న నిత్యావసర సరుకులకు స్టాండర్డ్ డిడక్షన్ ఏమాత్రం సరిపోదు. ఇన్‌కం టాక్స్ స్లాబ్‌లను 8 లక్షలకు పెంచితే ఆర్థికంగా నష్టపోతున్న మధ్యతరగతికి లాభం చూకూరుతుంది. విద్యారంగానికి మొండి చేయి చూపడం సామాజిక అసమానతకు తార్కాణం.

సంక్షిప్త సమాచారం

భీమిని : ఈ నెల 3వ తేదిన భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గోడప్ర తులను విడుదల చేశారు. భీమిని మండల అధ్యక్షుడు పెద్దపల్లి మహేష్, జిల్లా నాయకులు సదానందం, రమేష్ పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని నర్సాపూర్, మాదారం 3 ఇంక్లైన్, నీలాయపల్లి గ్రామాల్లో శనివారం మండల అధికారులు తాగునీటి సరఫరాపై స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, ఏఈ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు జగదీష్, తౌఫిక్, రంజిత్ పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : తెలంగాణ స్టేట్ లెవల్ రగ్బీ చాంపియన్‌షిప్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 15 శిభాగంలో స్టేట్ లెవల్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికైన సందర్భంగా వారిని ప్రధానోపా ధ్యాయులు జోబిన్, పీఈటీ రాజేందర్ ప్రతిభ కనబరిచిన అక్షయ్‌కుమార్, అనుష, కుమార్, రేషలను అభినందించారు.

జన్నారం : మండల యాదవ సంఘం 2025 క్యాలెండర్లను శనివారం జన్నారంలో ఎస్ఐ రాజవర్ధన్, వెటర్నరీ డాక్టర్ శ్వేతలు విడుదల చేశారు.

బెల్లంపల్లి : పదవీ కాలం ముగిసిన బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా శాలువాతో సన్మానించారు.

గర్మిళ్ల : జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి డాక్టరేట్ పొందిన సందర్భంగా శనివారం టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, పాల్గొన్నారు.

భీమిని : వడాల ప్రాథమిక పాఠశాల భూమిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ బిక ర్ణ దాస్ వడాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. సర్వేలో పాఠశాల భూమి కబ్జాలో లేదని తేలిందన్నారు.

మందమర్రిరూరల్ : సారంగ పల్లి గ్రామంలోని దుబ్బపల్లిలో 5 నుంచి 7వ తేదీ వరకు రమా సమేత సత్య నారాయణ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని పూజారి సత్య నారాయణ తెలిపారు. శనివారం ఆర్ఐ గణపతికి, సీఐ శశిదర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లకు ఆహ్వాన పత్రికలను అందించారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

నస్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గామాత దేవాలయంలో శనివారం పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీరాంభట్ల ఆనంద్ శర్మ సాత్విక్ శర్మ, ఆకాష్ శర్మ, వెంకటరమణ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిగింది. పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు బోడ్డయ్య, మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో పద్మశాలి సంఘ భవనంలో శనివారం మార్కండేయ స్వామి జయంతి వేడుకలను సంఘం నాయకులు వైభవంగా నిర్వ హించారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వోడ్నాల శంకర్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవయ్య, దుబ్బయ్య, దేవేందర్,



ఆలయంలో పూజల్లో పాల్గొన్న పద్మశాలీలు

శ్రీనివాస్, పద్మ, వెంకటలక్ష్మి, భ్యాగలక్ష్మి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల హనుమాన్ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీమార్కండేయ స్వామి జయంతి వేడుకలను శనివారం సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల రాజగురువయ్య, ఇటిక్యాల అధ్యక్షుడు చంద్రయ్య, మహేష్, చందు, శ్రీను పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలో పద్మశాలి సం ఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేష్, ప్రధాన కార్యదర్శి దుస్స భూమన్నల ఆధ్వర్యంలో మార్కం డేయుని చిత్రపటానికి పూలమాలలు వేశారు. సం ఘం గౌరవాధ్యక్షుడు భూమన్న, వెంకటేష్, దేవయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి : పట్టణంలోని శివ భక్త మార్కండేయ దేవాలయంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలీలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నాల అటవీ ప్రాంతంలో పెద్దపులి

- ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని కన్నాల అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా పులి తిష్టవేయడంతో సమీప గ్రామాల ప్రజలకు భయం వీడడం లేదు. శనివారం మధ్యాహ్నం కన్నాల శివారులోని ఓ పత్తిచేనులో పెద్దపులి అడవి పందిపై దాడి చేసి హతమార్చినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. అలాగే పత్తిచేనులో పనిచేస్తున్న కూలీలకు పెద్దపులి కనిపించిందని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కన్నాల , లక్ష్మీపురం ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని సంబంధిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల యా జమాన్యం పులి భయంతో విద్యార్థులకు సెలవు ప్రకటించింది. కన్నాల అటవీ శివారు ప్రాంతాలైన కన్నాల, లక్ష్మీపురం, బుగ్గగూడెం, పెద్దగూ డెం, పెద్దనపల్లి, బుగ్గ దేవాలయం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు గత మూడు రోజులుగా పులి భయంతో వణికిపోతున్నారు.

యువకుడి ఆత్మహత్య

నస్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగార్జున కాలనీలో నివాసం ఉంటున్న గోనె సాయి కుమార్ (33) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపారు. సాయి కుమార్ భార్య పద్మకు జ్వరం రావడంతో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో గత నెల 30న చేర్పించాడు. ఆ రోజు ఇంటికి వచ్చిన సాయి కుమార్ మరుసటి రోజున అసుపత్రికి రాకపోవడంతో భార్య బంధువులకు చెప్పి ఇంటికి వెళ్లి చూడమన్నది. వారు శుక్రవారం రాత్రి సమయంలో ఇంటికి వెళ్లి చూస్తే ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. శనివారం ఫిర్యాదు అందిన మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

మమ్మీ డాడీ క్షమించండి..

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



యోగిత(ఫైల్)

నస్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలో మనస్తాపంతో పదో తరగతి చదువుతున్న బాలిక శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. 'మమ్మీ డాడీ నన్ను క్షమించండి... నేను ఒక గోల్ అను కున్నా, కానీ నా వల్ల అయితలేదు.. పదో తరగతిలో 10జీపీఏ వస్తాయని ఆశ పెట్టుకున్నా.. నేను మీ తోడు ఉంటా అనుకున్నా మమ్మీ, డాడీ'.. అంటూ బాలిక సూసైడ్ నోట్‌లో పెర్కొంది.... ఎస్సై సుగుణాకర్ చెప్పిన వివరాల ప్రకారం...నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ లోని రాంనగర్‌కు చెందిన చిలువేరు యోగితా (16) శనివారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు చిలువేరి దేవేందర్-జ్యోతిలు ఉపాధి నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురంలో లిక్కర్ గోదాంలో పని చేస్తున్నారు. వీరి స్వగ్రామం పెద్దపల్లి జిల్లా జమ్మికుంట మండలం వెంచపల్లి గ్రామం. నస్పూర్‌లోని రాంగనగర్‌లో అమ్మమ్మ మోతుకూరి కొమురమ్మ, మేనమామ దగ్గర ఉంటూ యోగితా పదో తరగతి చదువుతోంది. యోగితా శుక్రవారం స్కూల్‌కు వెళ్లి వచ్చి రాత్రి అమ్మమ్మతో కలిసి పడుతుంది. తెల్లవారు జామున అమ్మమ్మ లేచి చూసే సరికి మంచంపై మనుమరాలు కనిపించకపోవడంతో వంట రూంలో చూడగా చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శవాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.. తల్లిదండ్రులు శనివారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపారు.

ముగిసిన నాగోబా జాతర



నాగోబాకు మొక్కుతున్న మెస్రం వంశీయులు



నృత్యం చేస్తున్న మెస్రం వంశీయులు, మహిళలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతర శనివారం ముగిసింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు జాతర పరిసరాలు కిక్కిరిశాయి. దర్శనం కోసం గంటల తరబడి బారులు తీరారు. ముందుగా నాగోబాతో పాటు సతీదేవతలను దర్శించుకున్న భక్తులు వేసిన కానుకలను మెస్రం వంశీయులు కితల వారీగా పంచుకున్నారు. అనంతరం ప్రసాదంతోపాటు కొబ్బరికాయలు, మ ట్టికుండలు మెస్రం వంశీయులతో పాటు వారి దగ్గరి బంధువులకు పంపిణీ చేశారు. మహాపూజలకు వాడిన మట్టికుండలను 22 కితలకు చెందిన వారికి పంపిణీ చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ కాగడాలను వెలిగించి, బేతాల్ పూజలను ప్రారంభించారు. బేతాల్‌దేవత పేరిట సంప్రదాయ పద్ధతిలో నెలపై తంబాకు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గోవాడ్‌కు చేరుకున్నారు. గోవాడ్ ఎదుట మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ చేతి కర్రతో పాటు పెద్దల పాదాలను నీటితో కడిగారు. మహిళలు, మెస్రం వంశీయులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వారి వాయిద్యాలు వాయిస్తూ మహిళలు, పురుషులు వేర్వేరుగా బేతాల్ నృత్యాలు చేసి అక్కడి నుంచి నాగోబాను దర్శించుకున్నారు. అనంతరం నాగోబా పూజలతోపాటు సంప్రదాయ పూజలకు ముగింపు పలికారు.

ఇసుక డంప్ స్వాధీనం

రెబ్బెన, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం రాళ్లపేట రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం అక్రమంగా నిల్వ ఉంచిన 75 ట్రిప్పుల ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్నామని తహసిల్దార్ రాంమోహన్ రావు, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. రాత్రి వేళలో ఇక్కడ ఇసుక డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లగా 75 ట్రిప్పుల ఇసుక ఉందన్నారు. ఈ మేరకు ఇసుక కుప్పలను స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని, ఇసుక అక్రమంగా నిల్వ చేయొద్దని తెలిపారు.

పాక్షికంగా ఇల్లు దగ్ధం

కెరమెరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోర గ్రామానికి చెందిన కోట్నాక చంద్రమతికి చెందిన పెంకుటిల్లు శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయంది. ఈ ప్రమాదంలో ఇంటి సామగ్రి, నగదు లక్ష రూపాయలు కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని చంద్రమతి తెలిపారు.

విద్యుత్ థర్మల్ కేంద్రాలకు సకాలంలో బొగ్గు అందించాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ థర్మల్ కేంద్రాలకు బొగ్గు సకాలంలో అందించాలని ప్రతి రోజు 2.6 లక్షల టన్నులు తగ్గకుండా ఉత్పత్తి రవాణా జరిగేలా అన్ని ఏరియాల జీఎంలు చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. శనివారం సింగరేణి భవన్ నుంచి ఏరియాల జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ ఓపెన్‌కాస్టుల్లో రోజు 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని, దీని ద్వారా బొగ్గు ఉత్పత్తి పెంచే అవకాశాలుంటాయన్నారు. అంతేకాకుండా కర్ణాటక పవర్ కార్పొరే షన్ లిమిటెడ్ నుంచి వస్తున్న డిమాండ్ మేరకు 11 రేక్‌లకు మించకుండా బొగ్గును సరఫరా చేయాలన్నారు. సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయాలన్నారు. బొగ్గు రవాణా కోసం రైల్వే అధికారు లతో సమన్వయం చేసూకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. బొగ్గు ఉత్పత్తిలో నాణ్యత, రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధికారులు, కార్మికులు కలిసి కట్టుగా లక్ష్యాలను సాధించాలన్నారు. సమావేశంలో అధికారులు సుబాని, రవి ప్రసాద్, మనోహర్, జీఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరాం



హైపవర్ కమిటీ వేతనాలు అందజేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సింగరేణివ్యాప్తంగా పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అందజేయాలని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయంలో శనివారం కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులకు సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, సీఎంపీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పలువురు బీఎంఎస్‌లో చేరగా, వారికి సత్తయ్య కండువాలు కప్పారు. అనంతరం బీఎంఎస్ సెక్యూరిటీ విభాగం కన్వీనర్‌గా కలవేణి స్వామి, కో-కన్వీనర్‌గా నీరటి సురేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు మోతె ఓదెలు, బుర్ర అరుణ్ గౌడ్, అడిగొప్పుల రాజ్‌కుమార్, మిట్టపల్లి మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కంటాక్స్ రద్దు చేయకపోవడం దారుణం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఈ బడ్జెట్‌లో ఇన్‌కంటాక్స్ రద్దు చేయక పోవడం దారుణమని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె. శ్రీనివాస్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి అన్నారు. శనివారం మందమర్రిలో వారు మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు ఇన్‌కంటాక్స్‌తో నెల నెల రూ. 30 వేలకు పైగా వేతనాల్లో నష్టపోతున్నారన్నారు. బడ్జెట్‌తో బొగ్గు గని కార్మికులకు ఊరట లభిస్తుంని అనుకుంటే అది జరగలేదన్నారు. దీనిపై అన్ని కార్మిక సంఘాలు ఆందోళనలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులతో పోటీ వాతావరణం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రోత్సాహక బహుమతులతో ఉద్యోగుల్లో పోటీ వాతావరణం నెలకొంటుందని ఆర్కే 5 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా అన్నారు. జనవరి మాసంలో 97 శాతం ఉత్పత్తి సాధించిన సందర్భంగా పలువురు ఉద్యోగులకు శనివారం ఆర్కే 5 గని ఆవరణలో బహుమతులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఇదే స్ఫూర్తితో ఈ నెల టార్గెట్‌తో పాటు ఆర్థిక సంవత్సరం వందకు వంద శాతం ఉత్పత్తి సాధించేలా కృషి చేయాలన్నారు. చైర్మన్, డైరెక్టర్ల నిరంతర సమీక్షలు, ఏరియా జీఎం ప్రత్యేక పర్యవేక్షణతో కంపెనీ స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. యువ ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య, రక్షణాధికారి రాందాస్, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలంటే అంకిత భావంతో పనిచేయలని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. శనివారం స్థానిక జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏరియా ఇప్పటి వరకు 91 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. ఈ రెండు నెలలు లక్ష్యానికి కీలకమని తెలిపారు.

55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, విప్ ఐలయ్య

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.


మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏక సభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

- రూ. 12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు
- రైతుల కోసం పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం
- విద్యా రంగంలో ఏఐ సేవలకు చేయూత
- తగ్గనున్న ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు
- లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి నిర్మలా సీతారామన్



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు, మధ్యతరగతి ప్రజలకు ప్రాధాన్యం కల్పించింది. ఆ దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారంరూ. 50,65,345 కోట్ల కేంద్ర బడ్జెట్‌ను విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు, వేతన జీవులకు అధిక ప్రాధాన్యం కల్పిం చింది. ఏడాదికి రూ. 12 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపు కల్పించింది. దీంతో పేద, మధ్య తరగతి, ఉద్యోగులకు పన్ను రూపంలో రూ. 80వేల వరకు ఆదా కానుంది. దీంతో జిల్లాలోని సుమారు 3వేల మంది ఉద్యోగులకు, వేతన జీవులకు ప్రయో జనం చేకూరనుంది. ప్రదానమంత్రి ధన్ ధ్యాన్య కృషి యోజన పథకంను బడ్జెట్‌లో ప్రవేశ పెట్టింది.

● వెనుకబడిన జిల్లాల్లో..

పథకంలో భాగంగా వెనుకబడిన జిల్లాలలో వ్యవ సాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు నిర్ణయించారు. తక్కువ పంటల ఉత్పాదక కలిగిన ప్రాంతాలకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీని ద్వారా దేశ వ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది. దేశంలో ఉత్పత్తి తక్కువ ఉన్న వంద జిల్లాలను ఎంపిక చేసి ఉత్పాదకతను పెంపొందించడానికి వ్యవసాయాన్ని వైవిధ్య పరచడానికి, నీటి పారుదల సౌకర్యాలను మెరుగు పరచడం, పంటకోత అనంతరం నిల్వ సామార్థ్యాన్ని బలోపేతం చేయడం ఈ పథకం ఉద్దేశ్యం. ఈ పథకం ద్వారా దేశంలోని వెనుక బడిన ప్రాంతంగా ఉన్న ఆసిఫాబాద్ జిల్లాకు ప్రయోజనం చేకూరనుందని చెబుతున్నారు. వర్షదారంపైనే ఆధారపడి జిల్లాలో రైతులు వ్యవసాయం చేస్తుండగా ఈ పథకం జిల్లాలో ప్రవేశ పెడితే వ్యవసాయ రంగానికి ఎంతో మేలు కలుగనుంది. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచడంతో రైతులకు ప్రయోజనం చేకూర నుంది. దీని ద్వారా ఇచ్చే రుణాలకు వడ్డీ 4 శాతం లేదా అంతకన్నా తక్కువగా ఉంటుంది. కిసాన్ క్రెడిట్ కార్డు దారులకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన జీవన జ్యోతి బీమా యోజన వర్తించనుంది. దీంతో రైతాంగానికి ఎంతో ప్రయో జనం చేకూరనుంది. బడ్జెట్‌లో విద్యా రంగంలో ఏఐ సేవలను అందిం చేందుకు నిధులను కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్‌బాండ్ సేవలు అందుబాటులోకి రాను న్నాయి. డిజిటల్ ఫాంలో టెస్ట్ బుక్స్ తీసుకురా నున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరిం చనున్నారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందనున్నాయి. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం టర్మ్‌లోన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా జిల్లాలోని ఎ స్సీ, ఎస్టీ మహిళలకు వచ్చే ఐదేళ్లలో రూ. 2 కోట్ల వరకు రుణాలు అందించ నున్నారు. ఈ పథకంతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థిక స్వావలంబన పెరిగే అవకాశం ఉంది.

అన్ని వర్గాలకు పెద్దపీట..

- అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా నాయకుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు పెద్దపీట వేసింది. ఉద్యోగులకు, వేతన జీవులకు రూ. 12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇచ్చింది. రైతుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో అధిక ప్రాదాన్యం ఇచ్చింది. యువత ఉపాధి అవకాశాలను పెంచేందుకు బడ్జెట్‌లో నిధు లు కేటాయించింది. 82 రకాల వస్తువులపై సెస్‌ను తొలగించారు. 36 రకాల క్యాన్సర్‌కు సంబంధించిన మందులు చౌకగా లభించ నున్నాయి.

ఉద్యోగులకు ఊరట..

- కాంపెల్లి ఊశన్న, ఉపాధ్యాయ సంఘం నాయకుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో ఉద్యోగు లకు వేతన జీవులకు కొంచెం ఊరటనిచ్చింది. గతంలో ఉన్న విధానానికి భిన్నంగా కొత్తస్లాబ్ విధానంలో 12.75లక్షల వరకు టాక్స్ మినహాయింపు ఇవ్వడం మంచి పరిణామం. ఎడ్యుకేషన్ రుణాలపై టీపీఎస్ ఎత్తివేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని దేశంలో పెంచాలనే విదంగా బడ్జెట్ కేటాయింపులు చేశారు. అన్నివర్గాల ప్రజలు సంతృప్తి చెందే విధంగా ఆదర్శవంతంగా కేంద్ర బడ్జెట్ ఉంది.

బడ్జెట్‌లో విభజన హామీలు విస్మరించారు..

- బోగే ఉపేందర్, ఏఐటీయూసీ నాయకుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ విభజన హామీలను విస్మరించారు. కేంద్ర బడ్జెట్ కార్మి క కర్షక వ్యతిరేకంగా బడ్జెట్‌లో నిరుపేద ప్రజలతో పాటు కార్మికులను విస్మరించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి గత సంవత్సరం కేటాయిం చిన 63 వేల కోట్లు మాత్రమే ఉంది. ఇంకా అదనంగా పెంచలేదు, ఇది పేదల బడ్జెట్ అని చెప్పడం మోస పూరితం. ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లే విధంగా ఉంది.

57 మంది బాల కార్మికుల గుర్తింపు


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-11 విడతలో జిల్లా వ్యాప్తంగా 57 మంది బాలల గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం విజయవంతం కోసం జిల్లాలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 1 నుంచి 31 వరకు నెల రోజు ల పాటు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని చెప్పారు. ఇందులో 57 మంది బాల కార్మికులను గుర్తించామని తెలిపారు. ఇందులో 54 మంది బాలురు, 3 బాలికలు ఉన్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌ల 21 మంది బాలురు, కాగజ్‌నగర్ డివిజనలో 33 మంది బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేశామని అన్నారు. బాలబాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగిం చినట్లు తెలిపారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు.

కాపువాడలో కార్డన్‌సెర్చ్


కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కాపువాడలో శనివారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామానుజం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. కాలనీలో అపరిత వ్యక్తులున్న, లైసెన్స్ లేని వాహనాలు నడిపినా కూడా సీజ్ చేస్తామన్నారు. ప్రధానంగా కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నట్టు, బ్యాంకు వివరాలు ఎవరు కూడా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా లైసెన్సులు లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు సందీప్, సుధాకర్‌తో సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కార్డన్‌సెర్చ్ అని జైనూర్ సీఐ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో జిలా ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో కార్డన్ నిర్వహించిన్నట్లు నిర్వహించిన్నట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో ధ్రువీకరరణ పత్రాలు లేని 46 దిచక్ర వాహనాలు స్వాధీనం చేసిన్నట్లు తెలిపారు. కార్డన్‌సెర్చ్‌లో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలు, 67 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పారిగాంలో కబడ్డీ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిగాం గ్రామంలో శనివారం శివాజీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, సత్యనారాయణ, నాని, నానాజీ, శంకర్, విలాస్, అశోక్, స్వప్నిల్, దివాకర్, ఉద్ధవ్, శేఖర్, మనోజ్, ప్రశాంత్, సాయి, ధన్‌రాజ్, సంతోష్, కుసబ్‌రావు, భావూజీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్ల సీజన్ మొదలైనందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలని జిల్లా బాలల రక్షణాధికారి మహేష్ అన్నారు. బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలరంక్షణ భవన్ సిబ్బంది శ్రావన్‌కుమార్, శ్రీనివాస్, బాల ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, జమున, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

సిర్పూర్(యు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడ్డిగూడ గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమకి పాఠశాలను శనివారం మహగాం స్కూల్ ఏసీఆర్పీ మండాడి గాగ్రు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి తెలుకున్నారు. ఆయన వంట ఉపాధ్యాయుడు కనక రామారావు ఉన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

వాంకిడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 108లో మహిళ ప్రసవించింది. వాంకిడి మండలంలోని లెండిగుడ గ్రామానికి చెందిన జి సోనికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుంటుబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది అంబులెన్స్‌తో సోని ఇంటికి చేరుకొని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పుడు అధికమయ్యాయి. ఈఎంటి ప్రవీణ్, పైలెట్ విలాస్ సోని తల్లి సహకారంతో ప్రసవించింది. అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 108 సిబ్బందికి సోని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిన్నింగు మిల్లుల్లో పత్తి నిలువలు అధికంగా ఉండడంతో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అదికారి అశ్వక్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసి ఫాబాద్, వాంకిడి, జైనూరు జిన్నింగ్ మి ల్లులో ఈ నెల 3, 4, తేదీల్లో, కొండపల్లి, సిర్పూర్, కౌటాల జిన్నింగ్ మిల్లులో 3, 4, 5 తేదీల్లో కొనుగోళ్లు ఉండవని తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటంచాలని సరస్వతి శిశుమందిర్ పాఠశాల అధ్యక్షురాలు, డాక్టర్ అనిత తెలిపారు. శనివారం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

దహెగాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మర్రిపల్లి, కల్వాడ, దేవులగూడ, కమ్మర్‌పల్లి గ్రామాల్లో నాటు స్థావరాలపై శనివారం ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 20 లీటర్ల నాటు సారా, 400 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

బెజ్జూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య అన్నారు. మండలంలోని పెద్దసిద్దపూర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో శంకర్, రవి, సురేష్‌గౌడ్, రాజారాం, నిర్వాహకుడు తులసీరాం పాల్గొన్నారు.

గంగాపూర్ జాతర ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్‌లో నిర్వహించనున్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరను అధికారులు సమన్వయంతో పని చేసి ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎసీప చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి సంబందిత అధికారులు, జాతర కమిటీ ప్రతినిదులతో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతర నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, దేవాదాయ శాక అదికారులు జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం పార్కింగ్ స్థలం చదును చేయాలని, కమిటీ ప్రతినిధులతో కలిసి దేవాలయాన్ని అందంగా ఉండేలా రంగులతో తీర్చిదిద్దాలన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించాలని, షామియానాలు ఏర్పాటు చేయాలని, ఫ్లెక్సీలు, ఆహ్వానపత్రికలు సిద్ధం చేయాలన్నారు. వలం పాటపై పత్రికలలో వచ్చేలా ప్రకటనలు చూడాలని, వేలం జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి 500 మీటర్ల లోపు తాగునీటి సదుపాయం, తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, పోలీసు శాఖ ఆద్వర్యంలో భద్రత ఏర్పాటు చేయాలని, సింగరేణి సంస్థ సమన్వయంతో లైట్లు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో 24 గంటల పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖాధికారులు మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రత్యా మ్నాయంగా జనరేటర్ అందుబాటులో ఉంచాలని, నలుగురు లైన్‌మెన్‌లలను నియమించాలన్నారు. అగ్నిమాపక అధికారులు వాహనాన్ని సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవలని సూచించారు. ఈ సందర్బంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, సీఐ బుద్దేస్వామి, తహసీల్దార్ రామ్మో వాన్, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రెబ్బెన. (ఆంధ్రజ్యోతి): బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఉన్న బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రతపై హైదరాబాద్ స్వచ్చంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. మొదటి విడతగా జిల్లాలో 12 పాఠశాలల్లో చేపడుతామన్నారు. విఅనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ విద్యార్థినులు చక్కటి లక్ష్యాలతో చదువుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పరిచయం అధికారి ఆడెపు భాస్కర్, రెడ్ ఎక్స్‌ప్రెస్ భాను కల్లుకూరి, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త శారద, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి పద్మ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండల సభ్యులు, స్థానానికి, ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఎన్నికల షెడ్యూల్‌లో ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికలు జరిగే జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలలని చెప్పారు. 24 గంటలు, 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక అందించాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో 6,513 మంది ఓటర్లు ఉండగా 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నియామకం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బీజేపీ నాయకడు కాంద్రె విశాల్‌ను టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఎంపీ గొడెం నగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విశాల్‌ను పలువురు బీజేపీ నాయకులు సన్మానించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): లగ్గాం గ్రామానికి చెందిన కోంద్ర ప్రభాకర్‌గౌడ్‌ను టెలకాం అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా నియమించడంతో సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబును శాలువాతో సన్మానించారు. తనను నామినేషన్ చేసిన ఎంపీ నగేష్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి


శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం శివభక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు హోమం నిర్వమించారు. అనంతరం ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు కోలాటం ఆడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు అంజనే యులు, శ్రీకాంత్, ఎ.శ్రీకాంత్, లింగయ్య, చందు, శంకర్, మోహన్, అజయ్, అంజయ్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మార్కండేయ జయంతి వేడుకలు పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో తాత్కాలిక అధ్యక్షుడు కుడిక్యా రాజమౌళి, రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, పద్మశాలి సీనియర్ నాయకులు సిందం చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మార్కెండేయ జయంతి నిర్వహించారు. పూజా కార్యక్రమాలు మంగ సమ్మయ్య దంపతులు నిర్వహించారు. సింగరేణి జీఎం శ్రీనివాస్ దంపతులు పూజ, హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు రూ.600 చెల్లించాలి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజు వారీగా రూ.600 చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ప్లకార్డులతో సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు ప్రభాకర్, బాపన్న, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.